క్లుప్తంగా

కార్మికుడికి ఆర్థిక సాయం



గుడివాడ టౌన్: ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ సేవా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం యూనియన్ కార్మికుడికి ఆర్థిక సాయం అందజేశారు. ఆటోనగర్‌లోని ఓ షాపులో పనిచేస్తున్న ఎస్.శ్యామ్ లక్ష్మణరావు అనే కార్మికుడు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. అతడి కుటుంబానికి అండగా ఉండేందుకు యూనియన్ ఆధ్వర్యంలో రూ. 10 వేలు వితరణ అందజేసినట్లు యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, గౌరవ అధ్యక్షుడు టి. లక్ష్మణరావు, ఎస్ మొహిద్దీన్ బాషా, ఆర్. నాగరాజు, కె. నాగరాజు, శ్యామ్‌కుమార్, ఎ. వెంకటరమణ పాల్గొన్నారు.

రైతులు నీటి తీరువా చెల్లించాలి

పెదపారుపూడి: మండలంలో అన్ని గ్రామాల్లోని రైతులు వ్యవసాయ భూముల నీటి తీరువా వెంటనే చెల్లించాలని తహసీల్దార్ శ్రీనునాయక్ బుధవారం పేర్కొన్నారు. నీటి తీరువాను సమీపంలోని సచివాలయంలోగాని మీ సేవా కేంద్రంలో గానీ చెల్లించి తగు రశీదు పొందలని కోరారు. నీటి తీరువా చెల్లించని రైతులకు జూలై ఒకటో తేదీ నుంచి ఆరు శాతం వడ్డీ విధించనున్నట్లు పేర్కొన్నారు.

పుస్తకాల పంపిణీ



మండవల్లి: మండవల్లి ఎంపీపీ పాఠశాల–2లో సర్పంచ్ మెండా ఝాన్సీ బుధవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పెదపారుపూడి: ఈనెల 21 జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా పంచాయతీ కార్యదర్శులు పని చేయాలని ఎంపీడీఓ విమాదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో సచివాలయాల ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. రోజు వారి హాజరు పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రమాదకర గొయ్యితో ఇబ్బందులు



తోట్లవల్లూరు: వల్లూరుపాలెం కేఈబీ కాలువ దిగువ భాగంలో ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. వంతెన దిగుతుండగా ఆర్ అండ్‌బీ రోడ్డు మలుపులో ఏర్పడిన భారీ గొయ్యి వాహనదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా రాత్రి వేళల్లో రాకపోకలు సాగించే వాహనదారులు గొయ్యి కనిపించక తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గొయ్యి పూడ్చించి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

మొవ్వ: మొవ్వలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సీడీపీఓ ఎస్ ప్రసన్నవిశ్వనాథ్ నాలుగో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీ స్కూల్ పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. అలాగే ఆహార నాణ్యతను, మెనూ సైతం పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రం కార్యకర్త ఎన్.గోపితో మాట్లాడుతూ స్కూలు విద్యార్థుల హాజరు పెంచాలని ఆదేశించారు. అలాగే అంతకుముందు మూడో నంబర్ కేంద్రాన్ని కూడా ఆమె పరిశీలించారు.

విద్యుత్ స్తంభాలతో షెడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

తోట్లవల్లూరు: విద్యుత్ స్తంభాలతో పశువుల షెడ్డు నిర్మించిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని దేవరపల్లిలో ఓ వ్యక్తి ప్రభుత్వానికి చెందిన విద్యుత్ స్తంభాలతో పశువుల షెడ్డు నిర్మించాడని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అధికారికంగా వినియోగించాల్సిన స్తంభాలను చోరీ చేశారా లేక సంబంధిత శాఖ సిబ్బంది సహకారంతో వ్యక్తి గత అవసరాలకు వినియోగించారా అనేది తేలాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

వంతెనల ఏర్పాటుతో అందని సాగునీరు

- సాత్‌చానల్ కింద రెండు వేల ఎకరాల్లో వరి సాగు
- అనుమతులు లేకుండానే వంతెనల ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు



పెదపారుపూడిలో తూములతో వేసిన వంతెన

పెదపారుపూడి: మండలంలోని సాత్ చానల్లో అనుమతులు లేకుండా విచ్చల విడిగా తూములతో వంతెనలు ఏర్పాటు చేయటంతో చివరి భూములకు సాగునీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వెంట్రప్రగడలో దోనపాడు చానల్ నుంచి సాత్ చానల్ ఏర్పడింది. వెంట్రప్రగడ, వానపాముల, జమిదింటకుర్రు, పెదపారుపూడి, భూషణగుళ్ల గ్రామాల్లో రైతులు సుమారు రెండు వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తుంటారు. అయితే చానల్‌కు ఎటువంటి అనుమతులు లేకుండా వంతెనలకు తూములు వేసి ఏర్పాటు చేశారు. వెంట్రప్రగడ నుంచి భూషణగుళ్ల వరకు సుమారు 15పైగా వంతెనలు ఉండటంతో చివరి భూముల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

పెదపారుపూడి గ్రామ ఆయకట్టుకు సంబంధించి అడుగు అడుగునా తూములతో వేసిన వంతెనలే కనిపిస్తున్నాయి. దీంతో పెదపారుపూడి భూషణగుళ్ల ఆయకట్టులోని చివరి భూములకు సాగునీరు అందటం లేదని రైతులు చెబుతున్నారు. ఇరిగేషన్ అధికారుల కళ్ల ముందే వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నా కనీసం ఎందుకు ఇలా చేస్తున్నారని కూడా అడగటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మామూళ్ల మత్తు కారణంగానే ఇరిగేషన్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ రాజగోపాల్‌ను వివరణ కోరగా చానల్‌పై తూములతో వేసిన వంతెనలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.


అధికారులు పట్టించుకోవడం లేదు



సాత్ చానల్లో అనుమతులు లేకుండా పలుచోట్ల తూములతో వంతెనలు ఏర్పాటు చేశారు. దీంతో పెదపారుపూడిలోని చివరి భూములకు సాగునీరు అందడం లేదు. చివరి పొలాలకు సాగునీరు అందకపోయినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– పొనుగుమాటి సువర్ణరాజు, కౌలు రైతు, పెదపారుపూడి

జీవితంలో యోగా ఒక భాగం



పామర్రులో యోగాపై మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పామర్రు: ప్రతిఒక్కరూ తమ జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలుకొండ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక టీఎస్ఆర్ అండ్ టీబీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో యోగాంధ్ర కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. యోగా వలన రోగాలు దరిచేరబోవన్నారు. మనోవికాసం, మానసిక నియంత్రణ సామర్థ్యం అలవరుచుకోవచ్చని తెలిపారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో అందరం పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ పర్ణం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు లెక్చరర్ డాక్టర్ కేఆర్ జి శేషకుమార్, ఇంగ్లిష్ లెక్చరర్ రవికుమార్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్య పాలనపై పుస్తకావిష్కరణ

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ఎండకడుతూ వైఎస్సార్ సీపీ మీడియా సెల్ రూపొందించిన పుస్తకాన్ని పశ్చిమ నియోజకవర్గంలోని 40, 41, 42, 43, 45 డివిజన్ క్లస్టర్ అధ్యక్షులు, కార్పొరేటర్లు ఆవిష్కరించారు. బుధవారం ఉర్మిళా నగర్‌లోని దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్లస్టర్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ కూటమి ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశారని విమర్శించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు అమలు కాని వాగ్దానాలను ఇచ్చి ప్రజలను ఏ విధంగా మోసం చేశారో ప్రజలకు తెలియజేసేలా వైఎస్సార్ సీపీ పుస్తక రూపంలో ముద్రించి ప్రజల ముందుకు తీసుకువస్తోందన్నారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు యరడ్ల ఆంజనేయరెడ్డి, ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, నాయకులు దొడ్డ రాజశేఖర్‌రెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, శరగడ శంకర్‌రెడ్డి, కంది శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అతిసార నియంత్రణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు ఎస్. రాజా ఆధ్వర్యంలో 125వ వార్డు సచివాలయం పరిధిలోని మోహన్‌లాల్ చంద్రభాగ సాబు మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమం జరిగింది. విద్యార్థులకు అతిసార వ్యాధిపై డాక్టర్ రాజా అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలోపు పిల్లలు అతిసార వ్యాధి బారిన పడకుండా ఓఆర్ఎస్, జింక్ సిరప్స్ అందజేస్తారని తెలిపారు. వ్యాధి తీవ్రతను బట్టి హాస్పటల్‌కు పంపించి చికిత్స అందిస్తారని చెప్పారు. ఇంటిలో లభించే పానీయాలు, పలుచని గంజితోపాటు తల్లిపాలు, కొబ్బరి నీళ్లు తప్పని సరిగా అందించాలని పేర్కొన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, భోజనానికి ముందు, మరుగుదొడ్డికి వెళ్లి వచ్చిన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుస్సేన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. తొలుత అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అతిసార వ్యాధి నివారణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పక్కా ప్రణాళికతో విద్యాబోధన



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ పీవీజే రామారావు

ఉయ్యూరు: ప్రణాళికాయుతంగా విద్యా బోధన చేసి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు అన్నారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా శాఖాధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఆరో తరగతిలో చేరే విద్యార్థులకు 40 రోజులు బ్రిడ్జి కోర్సులు నిర్వహించి సన్నద్ధులను చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సన్నబియ్యం అందించడంతో విద్యార్థులు ఇష్టంగా భోజనం చేస్తున్నారన్నారు. డీవైఈఓ పద్మారాణి, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు వైఎస్ఎన్ ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి జాకీర్ హుస్సేన్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీనివాస్, ఉయ్యూరు హెచ్ఎం నాగేశ్వరరావు, పలువురు ఎంఈఓలు పాల్గొన్నారు.

రాయితీపై కిసాన్ డ్రోన్లు అందజేత



రాయితీపై డ్రోన్‌లను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ ధనయ్య

కంకిపాడు: యాంత్రీకరణపై రైతులు దృష్టి సారించాలి ఏఎంసీ చైర్మన్ అన్నే ధన రామకోటేశ్వరరావు (ధనయ్య) అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో 80 శాతం రాయితీపై కోలవెన్నుకు చెందిన విఘ్నేశ్వర కిసాన్ గ్రూప్, మద్దూరు గ్రామానికి చెందిన కిసాన్ డ్రోన్స్ ప్రతినిధులకు బుధవారం డ్రోన్‌లను పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య మాట్లాడుతూ డ్రోన్ వాడకం వల్ల కూలీ ఖర్చులు ఆదా అవుతాయన్నారు. వ్యవసాయ పెట్టుబడులు నుంచి ఉపశమనం లభిస్తుందని చెప్పారు. రాయితీపై ఇచ్చే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కల్యాణి, బోడె వెంకటరామ్, పామర్రు ఏడీ స్వర్ణలత, డైరెక్టర్ గోగినేని రమణ, నాయకులు అనుమోలు ప్రభాకర్‌రావు, పులి కామేశ్వరరావు, సుదిమళ్ల రవీంద్ర, చలవాది రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

ఉయ్యూరు: ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులు దరిచేరవని న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య అన్నారు. ఉయ్యూరులోని మానికొండ భవన్‌లో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని ప్రజలు అలవర్చుకోవాలన్నారు. గ్రామీణ వైద్యులు ప్రజలకు మానవత్వంతో సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ఉయ్యూరు గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా తమ్మన ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా నాగబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వరరావు తదితరులతో కూడిన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమాన్ని సంఘ ప్రతినిధి నెల్లి రాంబాబు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తోట్లవల్లూరు: పెనమకూరు, కనకవల్లి గ్రామాల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.కృష్ణానాయక్ తెలిపారు. పెనమకూరు సబ్‌స్టేషన్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు, సాంకేతిక మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండబోదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేయండి

యండకుదురు(ఘంటసాల)/చల్లపల్లి: వర్షాలు మొదలై వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో డ్రెయినేజీ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలజీ అధికారులను ఆదేశించారు. 216 జాతీయ రహదారి వెంబడి ఉన్న మచిలీపట్నంలోని సత్య కన్వెన్షన్ వద్ద శివగంగ, ఘంటసాల మండలం యండకుదురు వద్ద ఐనంపూడి ప్రధాన డ్రెయిన్, చల్లపల్లి మండలంలోని గుండేరు ప్రధాన డ్రెయినేజీలను జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాలు కురిసినపుడు ముంపుతో రైతులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ముందుగానే మురుగు కాలువల్లో గుర్రపు డెక్క, తూటికాడ, కిక్కిస వంటి గడ్డిజాతి మొక్కలను తక్షణమే తొలగించాలన్నారు. ముందుగా ప్రాధాన్యత కలిగిన సాగునీటి మురుగు కాలువలకు పనులను, తర్వాత మిగిలిన డ్రెయిన్ల పనులు పూర్తి చేయాలని సూచించారు.

భూ సారాన్ని కాపాడుకునేందుకు పచ్చి రొట్ట



కురుమద్దాలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



కూచిపూడిలో పొలం పిలుస్తోంది



అయ్యవారి రుద్రవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా



కల్వపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

కనుమూరు(పామర్రు): భూ సారాన్ని కాపాడుకునేందుకు పచ్చి రొట్ట ఎరువుల వినియోగం చేపట్టాలని అప్పుడే ఖరీఫ్ సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ జ్యోతి రమణి పేర్కొన్నారు. మండల పరిధి కనుమూరు, కురుమద్దాలి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో అధిక మోతాదులో రసాయన మందుల వినియోగించడం ద్వారా నేల కలుషితమవుతోందన్నారు. భూ సార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలని సూచించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి మాట్లాడుతూ అధిక మోతాదులో పురుగు, తెగుళ్ల మందులను వినియోగించడం తగ్గించుకుని అవశేష రహిత పంట ఉత్పత్తులను పొందాలని తెలియజేశారు. నారు పోసుకునే ముందు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. తద్వారా తెగుళ్ల ఉధృతి కొంత వరకు తగ్గించవచ్చన్నారు. వరిలో ఆశించే చీడ పీడల యాజమాన్య పద్ధతుల గురించి రైతులు అవగాహన కల్పించామన్నారు. ఎలుకల యాజమాన్యంపై రైతులకు జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఏఓ శివ నాగరాణి, వ్యవసాయ అధికారి పద్మజ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో మేలు

కూచిపూడి(మొవ్వ): నారుమడులు పోసుకునే ముందు విత్తన శుద్ధి చేసుకుంటే అధిక దిగుబడును లభిస్తాయని మొవ్వ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ సహాయ సంచాలకులు, సూరపనేని శ్యామల పేర్కొన్నారు. బుధవారం మొవ్వ మండలం కూచిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆమె రైతులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలన నిర్వహించి రైతుల సమస్యల పరిష్కారం కోసం పలు సూచనలు ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు నాయక్ మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతులను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ జొన్నలగడ్డ కుమార సోమేశ్వర్, నాయకులు కొండవీటి అమర బాలేశ్వరరావు, వెంపటి గోపాలకృష్ణతో పాటు రైతులు పాల్గొన్నారు.

అయ్యవారిరుద్రవరంలో..

మండవల్లి: మండల సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి అల్లినగరంలో రైతులు వేసిన పచ్చిరొట్ట పైరును పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలోని పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి జి.శ్రీనివాసరావు రైతులకు సాంకేతిక సలహాలు వివరించారు. పెరికెగూడెం సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, నీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: వ్యవసాయ నిపుణుల సూచనలు, సలహాలు పాటిస్తూ రైతులు ఖరీఫ్ సేద్యాన్ని కొనసాగించాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా అన్నారు. మండలంలోని దాకరం, అప్పారావుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పరిరక్షించుకునేందుకు పచ్చిరొట్ట పైర్లను సాగు చేసుకోవాలన్నారు. మండవల్లి ఏడీఏ వెంకటమణి, ఏఓ వేణుమాధవ్, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ సతీష్, దాకరం సర్పంచ్ రాజా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

కైకలూరు: రసాయనాల సాగు వద్దు.. కేవలం ప్రకృతి వ్యవసాయమే ముద్దు అనే నినాదాన్ని వ్యవసాయ, ప్రకృతి సాగు సిబ్బంది పొలాల్లోకి వెళ్లి రైతులకు వివరించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా చెప్పారు. ఖరీఫ్‌లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని కైకలూరు, ముదినేపల్లి మండలాల్లో రైతులతో సమావేశం బుధవారం నిర్వహించారు. కైకలూరు మండలం వేమవరప్పాడు రైతు సేవా కేంద్రంలో రైతులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్‌ను కేవలం రూ.2 లక్షలకు కమిటీగా ఏర్పడిన రైతులకు అందిస్తోందన్నారు. కేవలం 10 నిముషాల్లో ఎకరం మందును పిచికారీ చేయొచ్చన్నారు. డ్రోన్‌ను అద్దెకు తిప్పుతూ పెట్టుబడి సాయాన్ని త్వరగా తీర్చుకోవచ్చన్నారు. కైకలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ భూమికి ఎండ తగలకుండా ఎదో ఒక పంటను వేయాలని చెప్పారు. వెటర్నరీ డాక్టర్ ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీతో విత్తనాలు, కేవలం పెయ్య దూడలు జన్మించే సీరంను అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తయారు చేసిన బీజామృతంతో విత్తన శుద్ధిని పరిశీలించారు. సర్పంచ్ నున్న రాంబాబు, ఏఓ ఆర్.దివ్య పాల్గొన్నారు.

సార్వాలో అనుకూల వరి రకాలు

గుడ్లవల్లేరు: రైతులు తమ సార్వా సాగులో అనుకూల వరి రకాల విత్తనాలను వినియోగించుకోవాలని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బి.నవీన్ సూచించారు. గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడిలో బుధవారం రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి నారు మడి యాజమాన్యంతో పాటు కలుపు, చీడపీడలపై అవగాహన కల్పించారు. వరి నారుమడిలో అవసరం మేరకు ఒక కేజీ పొటాష్, జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఐదు సెంట్లు నారు మడికి కర్బో ఫ్యూరాన్ గుళికలు 120 గ్రాములు ఇసుకలో కలిపి నీళ్లు తీసి చల్లాలని సూచించారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ



ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు వీటిని అందజేస్తూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కిట్ల వలన తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు వినియోగానికి ఎంతో అనువుగా ఉంటాయన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్ష



పెదన: మండల పరిధిలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో డీఎస్సీ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజారమేష్, అడ్మిన్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగన ఈ పరీక్షకు 180 మందికి గాను 172 మంది హాజరయ్యారని, 8 మంది ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 180 మందికి గాను 176 మంది హాజరయ్యారని, నలుగురు ఆబ్సెంట్ అయ్యారన్నారు. రెండు సెషన్స్‌లలో 360 మందికి గాను 348 మంది హాజరవ్వగా 12 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్ష జరిగిందని వారు పేర్కొన్నారు.



కొడాలి నాని అరెస్ట్ అవాస్తవం

ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ నాయకుడు, రాష్ట్ర మాజీ మంత్రి కొడాలి నానిని కృష్ణాజిల్లా పోలీసులు అరెస్ట్ చేశారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు తెలిపారు. కొడాలి నానిపై ఉన్న కేసులకు సంబంధించి కలకత్తా ఎయిర్‌పోర్టులో పోలీసులు అరెస్ట్ చేశారంటూ సామాజిక మాధ్యమాల వేదికగా వస్తున్న వార్తలు పక్కా అవాస్తవమన్నారు. కొడాలి నానిని నిజంగా అరెస్ట్ చేసినట్లైతే తాము అధికారికంగా అందరికీ తెలియజేయటం జరుగుతుందన్నారు. సామాజిక మాధ్యమాలతో నిరాధారమైన మెసేజ్‌లను పోస్టు చేయటం సరైన విధానం కాదన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

నేడు యోగా శిక్షణ

గుడివాడ టౌన్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో యోగా శిక్షణ నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కన్వీనర్ కోనేరు శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.